# ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్ : 4.40 (బుధవారం)

ANDHRAJYOTHY



## యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 2 ఏప్రిల్ 2024


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972


**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.140 | 203 | 231 |
| సూర్యాపేట | రూ. 150 | 220 | 250 |
| నల్లగొండ | రూ.146 | 210 | 234 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.0

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న రాజకీయ వేడి
- కరువుపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- మంత్రులు, మాజీ మంత్రుల నడుమ పరస్పర ఆరోపణల యుద్ధం



# మాటల మంటలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ నాయకులు మాటల మంటలు రేపుతున్నారు. కరువుకు బాధ్యత మీదంటే మీదేనంటూ ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. అటు మంత్రులు, ఇటు ప్రతిపక్ష నేతల మాటలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ సీఎం కేసీఆర్ పర్యటన, ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ జిల్లాకు రావడంతో బీఆర్ఎస్ నుంచి మొదలైన విమర్శలపై మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమారెడ్డిలతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ప్రతిస్పందించారు. సాగర్‌లో నీటి నిల్వల నుంచి మొదలు ఫోన్‌ట్యాపింగ్ వరకు ప్రతీ అంశంపై ధీటుగా ఆరోపణ, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు మరింత దగ్గరయ్యే నాటికి మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది.

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల ప్రచారం షురూ అవడంతో జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లాపైనే ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ దృష్టి సారించడంతో జిల్లాకు చెందిన ఇరు పార్టీల నేతల నడుమ మాటల యుద్ధం సాగుతోంది. జిల్లాలో ఎండిన పంట పొలాలను ఆదివారం పరిశీలించిన మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై సీరియస్‌గా విమర్శలు చేస్తే, సోమవారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకడుగు ముందుకేసి తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

### మంత్రులు, మాజీల నడుమ మాటల తూటాలు

మరోవైపు విద్యుత్ కోతలపైనా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి, మాజీ మంత్రి కేటీఆర్‌కు మధ్య మాటల యుద్ధం సాగింది. కరెంటు కోతలు లేవని, ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కట్టుకథలు అల్లుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అంటే, మంత్రి ఉత్తమ్ బుకాయిస్తున్నారని, కానీ కోతల్లేవని రైతుల వద్దకు వచ్చి చెప్పగలరా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. తన ఫోన్‌ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందని తాజాగా మంత్రి ఉత్తమ్ పేర్కొనడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బాధితులు ఇంకా ఎవరెవరు బయటకు వస్తారోననే ఆసక్తి నెలకొంది. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డికి నడుమ తీవ్రస్థాయిలో ఆరోపణలు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వ హ యాంలో సాగర్ నీళ్ల చివరి ఆయకట్టు వరకు ఇప్పించామని, దిగువకు నీళ్ల వెళ్తున్న సమయాల్లోనూ జిల్లా రైతాంగానికి సాగు నీరిప్పించామని, ఇప్పుడు కాల్వ కట్టలమీద పోలీసు బందోబస్తుతో దిగువకు నీళ్ల తీసుకెళ్తుంటే మంత్రి కోమటిరెడ్డి ఎందుకు కాల్వల మీదకు రావడం లేద ని మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి నిలదీశారు. రైస్‌మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నందునే ధాన్యానికి ధరలు తగ్గించినా మిల్లర్లపై చర్యలు తీసుకోలేకపోతున్నార ని ఆరోపించారు. మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి గతప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, విద్యుత్ మంత్రిగా దోపిడీకి పాల్పడ్డారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలు గుప్పిస్తుంటే, మరోవైపు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సైతం జగదీ‌ష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. మొత్తంగా ప్రజాసమస్యలు, కరువు, విద్యుత్ కోతలు, అవినీతి అంశాలపై రెండుపార్టీల నడుమ, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే ల నడుమ సాగుతున్న మాటల యుద్ధం లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చేసరికి ఇంకా ఏ స్థాయికి చేరుతుందోనని, ఇంకా ఏస్థాయి ఆరోపణలు వినిపిస్తాయోనని రాజకీయవర్గాల్లో చర్చ మొదలైంది.

### కరువుకు మీరే బాధ్యులంటే మీరే బాధ్యులని ఆరోపణలు

ఉమ్మడిజిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో పంటలు ఎండిపోయి రైతాంగం నష్టపోవడానికి మీరంటే మీరే కారణమని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ఆదివారం జిల్లాలో పర్యటించిన మాజీ సీఎం కేసీఆర్ ఈ కరువు కాంగ్రెస్ అసమర్థత వల్లే వచ్చిందని దుయ్యబట్టారు. ఇటు నాగార్జునసాగర్‌లో, అటు కాళేశ్వరంలో నీళ్లున్నా తెలివితక్కువతనంతో, అవగాహన రాహిత్యంతో నీళ్లివ్వకపోవడం వల్లే కరువు ప్రబలిందని ఆరోపించారు. పంటనష్టానికి కాంగ్రెస్‌దే బాధ్యతని, పంటనష్టం ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ వెంటపడతామని హెచ్చరించారు. అయితే కరువుకు గత కేసీఆర్ ప్రభుత్వ పాలనే కారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఆయన చేసిన పాపాలు, అన్యాయాల వల్లే ఈ దుస్థితి దాపురించిందని, గత పదేళ్లలో రాయి, రప్ప, ఇసుక దేన్నీ వదలకుండా దోచుకున్నారన్నారు. కేఆర్ఎంబీ సాకుతో సాగర్‌లో 14 టీఎంసీల నీరు తీసుకునే అవకాశమున్నా తీసుకోలేకపోయారని, ఇది ఈ ప్రభుత్వ అసమర్థతని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుని అప్పగించేందుకు అంగీకరించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రులు ఆరోపిస్తున్నారు.



అసమర్థ కాంగ్రెస్

# ప్రభుత్వంతోనే కరువు

- మాజీ మంత్రి కేటీఆర్

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పంటలు ఎండిపోయాయని, తాగునీరు కూడా దొరకడం లేదని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సోమవారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామంలో రైతులు గన్నెబోయిన మల్లయ్య, బోర్ల రాంరెడ్డిలను కలిసి కరువు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ నాటి తెలంగాణ రైతుల దుస్థితికి అవస్థలకు బోర్ల రాంరెడ్డి చిహ్నంగా నిలిచారని ఆయన ధీన పరిస్థితిని కేసీఆర్ 100సార్లు చెప్పారని గుర్తుచేశారు. రాంరెడ్డి పేరు బోర్ల రాంరెడ్డిగా మారిందన్నారు. కేసీఆర్ పర్యటనతో భయపడిన ప్రభుత్వం నంది పంప్‌హౌజ్‌లో నీళ్ల ఎత్తిపోసి కరీంనగర్‌కు నీళ్ల వదిలిందన్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు సాగర్ నుంచి టెయిల్‌పాండ్ దాకా సాగునీరు అందిందన్నారు. ఇప్పటివరకు సీఎంతో పాటు మంత్రులు రైతులను పరామర్శించ లేదన్నారు. ప్రధానప్రతిపక్షంగా కేసీఆర్ తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా జిల్లాలో పర్యటించి రైతులకు ధైర్యం చెబుతున్నాడన్నారు. వీడియోలో రైతు మల్లయ్య కష్టాలను చూసి చలించిపోయి ముశంపల్లి గ్రామానికి వచ్చానన్నారు. ఈ సందర్భంగా రైతు మల్లయ్య కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు.

### రెట్టింపు ఉత్సాహంతో పోరాడాలి : కేటీఆర్

గత ఎన్నికల్లో ఓటమితో బాధపడకుండా నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినా తాము ప్రచారం చేసుకోలేకపోయామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పేలా నల్లగొండ ఎంపీ స్థానాన్ని గెలుస్తామన్నారు.

### ప్రజలు నిలదీస్తారనే కాంగ్రెస్ దొంగ డ్రామాలు: మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ఆ కేసులు, ఈ కేసులు అంటూ దొంగ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయిలేదని అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్‌కు అలవాటు అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 110రోజుల సమయం ఇచ్చినా పాలనలో మార్పు రాకపోవడంతో మాజీ సీఎం కేసీఆర్ రైతులను ఓదార్చేందుకు వచ్చారన్నారు.

### రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రభుత్వం: ఎంపీ బడుగులు



రాష్ట్రాన్ని దుర్మార్గమైన ప్రభుత్వం పాలిస్తుందని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రజలు అనుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరుగుడే సరిపోయిదని, ప్రజా సమస్యలు ఆయనకు పట్టడం లేదన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతారని ఆయన ఎప్పుడు ఏంమాట్లాడుతారో ఆయనకే తెలియదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శరణ్యమని పేర్కొన్నారు.

### ఒక్కసారి అవకాశం ఇస్తే పార్లమెంట్‌లో పోరాడుతా



తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని సమస్యలపై పార్లమెంటులో పోరాటం చేస్తానని నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. 2014 ముందు తెలంగాణ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబడి ఉండేదని, సీఎం కేసీఆర్ సీఎం అయిన తర్వాత రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. కేసీఆర్ మాదిరిగానే తనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని రైతుల కష్టాలను తాను దగ్గర ఉండి చూశానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందడంతో చత్తీస్‌ఘడ్ నుంచి కూలీలు వచ్చి ఇక్కడ నాట్లు వేస్తున్నారని తెలిపారు.

---

## వడదెబ్బకు గురికాకుండా ప్రజలను చైతన్యపర్చాలి

### సీఎస్ శాంతికుమారి




కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1 : ఏప్రిల్, మే మాసాల్లో అధిక ఉష్ణోగ్రతతో కూడిన ఎండలతో వడదెబ్బ, డీ-హైడ్రేషన్‌కు గురికాకుండా ప్రజలను చైతన్యపర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ధాన్యం కొనుగోలు అంశాలపై సమీక్షించి, మాట్లాడారు. వేసవిలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే జిల్లాలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లు, ఇతర మందులను పెద్దమొత్తంలో పంపిణీ చేశామన్నారు. వాటికి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతీ ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి సరఫరాను పర్యవేక్షించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారి, ప్రతీ వార్డుకు గ్రామానికి మండల స్థాయి అధికారిని నియమించాలన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు జలాశయానికి తాగునీటి అవసరాలకు నీటి విడుదల చేశామని, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామని, కొద్ది రోజుల్లోఈ కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. మన ఊరు-మన బడి కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అదనపు కలెక్టర్లు పీ బెన్‌షాలోమ్, గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ : కలెక్టర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం-12(డీ) ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలను ఈ నెల 23 తేదీలోగా నోడల్ అధికారి శేఖర్‌రెడ్డికి అందజేయాలన్నారు. మే 5 నుంచి 8 లోపు సంబంధిత నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వేయవచ్చన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పీ బెన్‌షాలోమ్, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలి




మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరిగేందుకు సహకరించాలని అదనపు కలెక్టర్ పీ బెన్‌షాలోమ్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, ప్రక్రియలో భాగంగా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసేందుకు కూలీల సంఖ్య పెంచుకోవాలన్నారు. అలాగే ట్రక్‌షీట్లను ఆన్‌లైన్ చేయడానికి అనుమతించాలని, మిల్లుల వారీగా వానాకాలం 2023-24 సీఎంఆర్ డెలివరీ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ గోపిక్రిష్ణ, పౌరసరఫరాల అధికారి శ్రీనివా‌స్‌రెడ్డి, మిల్లర్ల ప్రతినిధులు, యాజమానులు పాల్గొన్నారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని కలెక్టర్ పీ బెన్‌షాలోమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నియమావళికి లోబడి రాజకీయ పార్టీల ప్రచార సామాగ్రి ముద్రణ పనులు చేయాలన్నారు. ప్రచార సామాగ్రి ముద్రణకు అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రింటింగ్ చేసేందుకు వసూలు చేసిన మొత్తం ధరకు సంబంధించిన వివరాలను సమర్పించాలన్నారు. పబ్లిషర్ల పేరు లేకుండా ఎన్నికల అంశాలతో ముడిపడిన పోస్టర్లు, కరపత్రాలు, ఇతర ప్రచార సామాగ్రిని ముద్రించినా, నిర్దేశించిన సంఖ్యకు మించి ముద్రించినా ఎన్నికల ప్రవర్తన నియమావళిలోని ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలకు గురికావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. నాగేశ్వరచారి, శ్రీకాంత్, ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు పాల్గొన్నారు.

# గతానికంటే ఘనం

- చౌటుప్పల్‌లో 80 శాతం ఆస్తిపన్నుల వసూళ్లు
- ఈ ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లిస్తే రాయితీ
- 5 శాతం తక్కువతో ఈనెలాఖరు వరకు అవకాశం



చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1 : ఆస్తి పన్నుల వసూళ్లలో చౌటుప్పల్ మునిసిపాలిటీ సత్తా చాటింది. గతేడాది కంటే 9 శాతం అధికంగా వసూలు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 80.40 శాతం ఆస్తి పన్నులను వసూలు చేసింది. మార్చి 31తో ఆస్తిపన్నుల వసూళ్ల గడువు ముగిసింది. పెండింగ్ ఆస్తిపన్నుల జరిమానాలపై 90శాతం కల్పించిన రాయితీ కల్పించే గడ వు కూడా దాటింది. మొత్తంగా రూ.5,52,65,000 ఆస్తి పన్నుల కింద వసూలు చేసింది. ఇకపోతే 2024-25 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్‌డ్‌గా ఆస్తిపన్ను చెల్లించేవారికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించింది. 2025 మార్చి 31 వరకు లెక్కించబడనున్న ఆస్తి పన్నులో గృహాలు, మడిగెల యజమానులకు ఈ రాయితీ ఇవ్వనున్నా రు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నుల చెల్లింపుదారులకు మాత్రమే అవకాశం వర్తిస్తుంది. అం దుకుగాను యజమానులు ఈనెల 30లోపుగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆస్తి పన్ను కట్టని వారికి ఈనెల 1 నుంచి ఆస్తి పన్నులపై నెల నెలా జరిమా నా పడనుంది. ఏదిఏమైనా 5 శాతం డిస్కౌంట్ అవకాశంతో ఈ నెల 30 వరకు ఆస్తిపన్నులను క్లియర్ చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరమని మునిసిపల్ సిబ్బంది తెలిపారు.

పట్టణంలో మొత్తం 8,318 ఆస్తులకు రూ.6,87,30,000 డిమాండ్ ఉండగా, అందులో రూ.5,52,65,000లను వసూలు చేశారు. ఇంకా రూ.1,64,65,000లు వసూలు చేయాల్సి ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరం కంటే 9 శాతం అధికంగా వసూలు చేసి అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారులు మెచ్చుకుంటున్నారు.

### వివిధ వర్గాల ద్వారా...

- రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 23కి సంబంధించి ఆస్తిపన్నులు రూ.13.73 లక్షలు రావాల్సి ఉండగా, అందులో రూ.4.46లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.9.27 లక్షలు రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన ఆస్తి పన్నుల బకాయిలు పేరుకుపోతున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- 6,860 గృహస్థుల నుంచి రూ.2,93,31,000లు రావాల్సి ఉండగా, అందులో రూ.2,24,43,000లు చెల్లించారు. మిగిలిన రూ.68.88లక్షలను చెల్లించాల్సి ఉంది.
- 983వ్యాపార మడిగెలకు సంబంధించి రూ.3,04,08,000లు రావాల్సి ఉండగా, అందులో రూ.2,26,88,000లు వసూలు చేశారు. ఇంకా రూ.77.20 లక్షలను చెల్లించాల్సి ఉంది.
- 452 గృహాలు కమ్ వ్యాపార మడిగెల నుంచి రూ.76.18 లక్షలకు రూ.66.88 లక్షలను వసూలు చేశారు. ఇంకా రూ.9.30లక్షలు చెల్లించాల్సి ఉంది.

### ఈ నెల 30 వరకు 5 శాతం డిస్కౌంట్



2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నులు అడ్వాన్స్‌డ్‌గా చెల్లించే యజమానులకు 5 శాతం డిస్కౌంట్ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశం ఈ నెల 30 వరకు ఉంటుంది. ఈ అవకాశాన్ని ఇళ్లు, వ్యాపార మడిగెల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. ఆస్తిపన్నులను సకాలంలో చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. కాగా, పట్టుదలతో ఆస్తిపన్నులను వసూలు చేసిన మునిసిపల్ సిబ్బందికి అభినందనలు.

\- ఎన్.వెంకటేశ్వరనాయక్, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

### ఐదు శాతం రాయితీతో ఈ నెల 30 వరకు చెల్లించే అవకాశం

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ఈ నెల 30లోపు చెల్లిస్తే 5శాతం రాయితీ వర్తిస్తుంది. గడువులోపు ఆస్తిపన్ను చెల్లించి 5శాతం రాయితీని పొందాలి. అలాగే సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

\- రామాంజుల్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్

### భువనగిరిలో 73 శాతమే...

భువనగిరి టౌన్ : భువనగిరి మునిసిపాలిటీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 73.69 శాతం ఆస్తిపన్ను వసూలైంది. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం గడువు నాటికి 14,628 ఆస్తుల నుంచి రూ.7.23 కోట్ల పన్ను డిమాండ్ ఉండగా గడువు ముగిసే నాటికి రూ.5.32కోట్లు (73.69 శాతం)వసూలై మిగతా రూ.1.90 కోట్లు బకాయిగా మిగిలింది. కాగా ఏరియర్ ఆస్తి పన్ను డిమాండ్ రూ.2.32 కోట్లు ఉండగా రూ.1.39 కోట్లు వసూలైంది. ప్రస్తుత ఆస్తి పన్ను డిమాండ్ రూ.4.90 కోట్లు ఉండగా రూ.3.93 కోట్లు వసూలైంది.

## ఆరోగ్య పథకాలు అందేలా కృషి చేయాలి



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పాపారావు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పాపారావు చెప్పారు. కలెక్టరేట్‌లో నూతనంగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బందికి సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంసీహెచ్ కార్యక్రమాలు వంద శాతం జరిగేలా కృషి చేయాలన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్య సిబ్బంది తగిన శిక్షణ అందించాలన్నారు.


గర్భిణులకు అల్ట్రా

## స్కానింగ్ పరీక్ష

- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు 7లో


# వీగిపోయిన అవిశ్వాసం

**పంతం నెగ్గించుకున్న ఎంపీపీ**

**బీఆర్ఎస్ ఎంపీటీసీల ఆందోళన**



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 1 : ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై బీఆర్ఎస్ ఎంపీటీసీల అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయిలో కోరం లేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. నారాయణపురం మండలంలో మొత్తం 13మంది ఎంపీటీలు ఉండగా గుజ్జ గ్రామానికి చెందిన సీపీఎం ఎం పీటీసీ ఇటీవల మృతి చెందాడు. దీంతో 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు చెందిన వారు తొమ్మిది, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి అధ్యక్షతన అవిశ్వాసనోటీసుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్‌కు ఎనిమిది ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలకు చెందిన ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గాలంటే 9 మంది ఎంపీటీసీలు ఉండాలని,బీఆర్ఎస్‌కి చెందిన ఎనిమిది మంది మాత్రమే హాజరు కావడంతో పూర్తిస్థాయిలో కోరం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీవో శేఖర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో అధికా ర కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎంపీటీసీలు పెట్టినఅవిశ్వాసం వీగిపోవడం తో అధికార పార్టీకి చెందిన ఎంపీపీ ఉమాదేవి తన పంతం నెగ్గించుకున్నట్లయింది. అవిశ్వాసం వీగిపోవడంతో ఎంపీపీగా యథావిధిగా కొనసాగనున్నారు.

### బీఆర్ఎస్ ఎంపీటీసీల ఆందోళన

చట్టాన్ని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా ఆర్డీవో శేఖర్‌రెడ్డి అధికార పార్టీకి కొమ్ముకాశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నిబంధన ప్రకారం తమకు పూర్తి మెజార్టీ ఉన్నా కావాలని అధికార పార్టీకి చెందిన ఎంపీపీకి అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. ఆర్డీవో వాహనాన్ని ముందుకు వెళ్లకుండా అడ్డుతగిలారు. చనిపోయిన ఎంపీటీసీని కూడా ఎలా పరిగనలోకి తీసుకుంటారంటూ నిలదీశారు.ఆందోళనలతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను తప్పించి ఆర్డీవో వాహనా న్ని పంపించి వేశారు. అనంతరం ఇదే విషయమై ఎంపీడీవో ప్రమోద్‌కుమార్‌తో బీఆర్ఎస్ ఎంపీటీసీలు కొంతసేపు వాగ్వాదం చేశారు. అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

### బీఆర్ఎస్ నుంచి ఎంపీటీసీ విజయ బహిష్కరణ

చిల్లాపురం గ్రామ బీఆర్ఎస్ ఎంపీటీసీ కరంటోతు విజయదశరథను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉమాదేవిపై అవిశ్వాస సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు.

# హరిహరులకు విశేష పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మ వార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసా గాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 41,93,233ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

### *యాదగిరిగుట్టలో సంప్రదాయ దుస్తుల పట్టింపేదీ?*

ఆలయాల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం వెల్లివిరిసేందుకు కొన్ని నిబంధనలు అమలుచేస్తారు. పుణ్యక్షేత్రాల్లో ఇవి పాటించడానికి భక్తులు కూడా సహకరిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనానికే కాకుండా సాధారణ దర్శనానికి కూడా డ్రెస్‌కోడ్‌ను భక్తులు తప్పనిసరిగా పాటించే నిబంధన ఉంది. యాదగిరిగుట్టలో నిత్యం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు బ్రేక్ దర్శనం ఉంటుంది. రూ.300 టికెట్ కొనుగోలుచేసి భక్తులు ఈ అవకాశం పొందే సౌకర్యం ఉంటుంది. ఈ టికెట్ ద్వారా 10ఏళ్లలోపు ఉన్న పిల్లలు మినహా భక్తులు నేరుగా అంతరాలయంలో స్వామిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. కొంతమంది భక్తులు వివిధ రకాల అధునిక(ఫ్యాషన్) దుస్తులతో ప్రధానాలయంలోకి వెళ్లి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. డ్రెస్‌కోడ్ అంశంపై ఈవో భాస్కర్‌రావు స్పందిస్తూ ఇప్పటికిప్పుడు మార్పులు చేయలేమని. ప్రభుత్వం, దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు అమలుచేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

**చివ్వెంల, ఏప్రిల్ 1:** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని తిర్మలగిరి గ్రామ సీనియర్ పంచాయతీ కార్యదర్శి నూకల కోటిరెడ్డికి వల్లభాపురం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలగిరి గ్రామంలో విధులు ముగించుకొని సూర్యాపేటకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ సమీపంలో జాతీయరహదారి-65పై కోటిరెడ్డి ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డికి తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.



# గర్భిణులకు అల్ట్రా స్కానింగ్ పరీక్షే

- డయాగ్నోస్టిక్ హబ్‌లో స్కానింగ్ కోసం పడిగాపులు
- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న గర్భిణులు, రోగులు
- డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేసినా అవస్థలే



భువనగిరిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్

**భువనగిరి టౌన్, ఏప్రిల్ 1:** తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువు ఆరోగ్యాన్ని వైద్యులు తెలుసుకునేందుకు ఏకైక మార్గం అల్ట్రాస్కానింగ్. అంతేకాక కడుపునొప్పితో బాధ పడేవారికి, రోడ్డు ప్రమాద బాధితులతో పాటు అవసరమైన వారందరికీ ఏ తరహా చికిత్స అందించాలో తెలుసుకునేందుకు అల్ట్రా స్కానింగ్ పరీక్ష చేస్తారు. బాధితులందరికీ ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు అందించేందుకు ఏడాది క్రితం భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేశారు. పలు రకాల రోగనిర్ధారణ పరీక్షలతో పాటు అల్ట్రా స్కానింగ్‌ను కూడా ప్రారంభించారు. మెజార్టీ పరీక్షల నిర్వాహణలో కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ అల్ట్రా స్కానింగ్ పరీక్షలు మాత్రం గర్భిణులతో పాటు అం దరికీ పరీక్ష పెడుతోంది. గర్భిణీకి 3వ, 7వ, 9వ నెలలో స్కానింగ్ చేసి పిండస్థ శిశువుతో పాటు తల్లి ఆరోగ్యా న్ని అంచనా వేస్తారు. దీంతో జిల్లా ఆస్పత్రిలోని టి హబ్‌కు ప్రతీ సోమవారం, గురువారం సుమారు 100 మందికి పైగా, సాధారణ రోజుల్లో సుమారు 25మంది గర్భిణులు, అదనంగా మరో 30 మంది వరకు రోగులు స్కానింగ్ కోసం వస్తుంటారు. వెంటనే స్కాన్ చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిన బాధ్యత టి హబ్ నిర్వాహకులది. కానీ వెంటనే చేయాల్సిన స్కానింగ్‌కు 10రోజుల వాయిదా ఇస్తుండడం టి హబ్ నిర్వాహకులకు అలవాటుగా మారింది. విధిలేని పరిస్థితుల్లో పలువు రు యథావిధిగా ప్రైవేట్ ల్యాబ్‌లనే ఆశ్రయిస్తున్నారు.

### రోజుకు 45 మందికి

టీ హబ్ ప్రొటోకాల్ ప్రకారం అర్హులైన ఇద్దరు అల్ట్రాసౌండ్ స్కానింగ్ టెక్నిషియన్స్, వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఒకే ఒక్క టెక్నిషియన్ మాత్రమే ఉన్నాడు. దీంతో రోజు తప్పించి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 45మందికి మాత్రమే అల్ట్రా స్కానింగ్ తీస్తున్నారు. దీంతో స్కానింగ్ కోసం వచ్చే వారికి వాయిదా తేదీలను ఇవ్వాల్సి వస్తున్నదని అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం అన్ని పని దినాల్లో స్కానింగ్ చేసి వెంటనే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించని సిబ్బంది స్కానింగ్ కోసం వచ్చే వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


### తొమ్మిది రోజుల వాయిదా తేదీ ఇచ్చారు



కడుపునొప్పితో సోమవారం భువనగిరి జిల్లా ఆస్పత్రికి వెళ్లా. ఓపీ డాక్టర్ స్కానింగ్ రాయడంతో టిహబ్‌కు వెళ్లాను. అక్కడ పెద్ద సంఖ్యలో గర్భిణులు స్కానింగ్ కోసం ఎదురుచూస్తుండగా స్కానింగ్ చేసే సిబ్బందే లేరు. పైగా గర్భిణులతో సిబ్బంది వాగ్వాదం చేస్తున్నారు. కడుపు నొప్పితో వెళ్లిన నన్ను స్కానింగ్ కోసం ఈ నెల 9న రావాలని వాయిదా తేదీ ఇచ్చారు. నేను గట్టిగా మాట్లాడడంతో అత్యవసరంగా టెక్నిషియన్‌ను పిలిపించి స్కానింగ్ పూర్తి చేశారు. ఈ తరహాలో టీ హబ్‌ను నిర్వహిస్తే రోగులు ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టపోయే పరిస్థితి.

- సుధాకర్, టేకుల సోమారం. వలిగొండ మండలం.

### గర్భిణులందరికీ స్కానింగ్ చేస్తున్నాం



గర్భిణులందరికీ సక్రమంగానే స్కానింగ్ చేస్తున్నాం. అత్యవసరం కాని ఇతరులకు మాత్రమే వాయిదా తేదీల ను ఇస్తున్నాం. టీహబ్ నిర్వాహణలో పూర్తిస్థాయి నిబంధనలు పాటిస్తున్నాం. ఎవరికీ ఇబ్బం ది కలగకుండా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సిబ్బంది ఖాళీలతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ మే రకు పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్లాం. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

- డాక్టర్ చిన్నా నాయక్, భువనగిరి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్.

## పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలి ఆత్మహత్య



పావని(ఫైల్)

**భువనగిరి టౌన్, ఏప్రిల్ 1:** ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భువనగి రిలోని కుమ్మరివాడలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉండే రాంపల్లి పావని(24) తమ సమీప బంధువులైన నార్కట్‌పల్లి మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన మండల శ్రవణ్‌తో ప్రేమలో పడింది. ఇద్దరు చాలా రోజులుగా సన్నిహితంగా ఉంటు న్నారు. పావనిని పెళ్లి చేసుకోవాలని అడిగేందుకు ఆమె తల్లిదండ్రులు భూపాల్, పద్మ ఇటీవల శ్రవణ్ ఇంటికి వెళ్లారు. శ్రవణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు వారితో అసభ్యంగా మాట్లాడి పెళ్లికి నిరాకరిం చారు. దీంతో మనస్తాపానికి గురైన పావని ఇంట్లో ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స అనంతరం కోలుకుంది. శ్రవణ్ గత నెల 27వ తేదీన ఇంట్లో మోతాదుకు మించి నిద్రమాత్రలు మింగటంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పావని 28వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 31వ తేదీ రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం సాయంత్రం మోటకొండూరు మండలం కదిరేనిగూడెం స్వగ్రామానికి తీసుకువెళ్లారు. పావని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మండల శ్రవణ్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రవణ్ బయటకు వచ్చిన అనంతరం అరెస్టు చేస్తామని ఎస్ఐ అరుణ్ తెలిపారు.

# మా డబ్బులు మాకివ్వండి

● సాగర్ పైలాన్ కాలనీలో పోస్ట్‌మాస్టర్ బాధితుల ధర్నా ● నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఘటన

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 1:** తాము జమ చేసుకున్న డబ్బులు మాకివ్వండి అని పోస్టాఫీస్ ఖాతాదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని పోస్టాఫీస్‌కు తాళం వేసి ధర్నా నిర్వహించారు. సాగర్ పైలాన్ కాలనీ పోస్టాఫీస్‌లో సబ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించిన రామకృష్ణ ఖాతాదారులు దాచుకున్న సొమ్మును రూ.2కోట్లు సొంత ఖాతాలకు మళ్లించుకున్నాడు. గత ఏడాది డిసెంబర్ నెలలో గుర్తించిన ఖాతాదారులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహించి సొంత ఖాతాలకు నగదు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. అదే నెలలో రామకృష్ణ పోలీసులకు లొంగిపోగా, ప్రస్తుతం నల్లగొండ జిల్లా జైలులో ఉన్నాడు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు అవుతున్నా తమకు నగదు రికవరీ చేయలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పలువురు బాధితులు పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నగదు రికవరీ చేయించాలని పోస్టల్ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు కూడా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయమై దేవరకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఖాతాదారుల నగదును సొంతంగా వాడుకోవడంపై విచారణ కొనసాగుతోందని, ఖాతాదారుల రికార్డుల నమోదు పూర్తయిందని తెలిపారు. సొమ్ము కాజేసిన సబ్ పోస్టుమాస్టర్ రామకృష్ణ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపించి త్వరలో ఖాతాదారులకు నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంటసేపు తర్వాతపోస్టాఫీస్ తాళం తీయడంతో పోస్ట్‌మాస్టర్ రంగయ్య విధులు నిర్వర్తించారు.




పైలాన్‌కాలనీ పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

# మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన



పద్మారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



పద్మారెడ్డి(ఫైల్)

**భువనగిరి రూరల్, ఏప్రిల్ 1:** పశువులు తన పొలంలో మేస్తున్నాయని రైతు సంబంధిత పశువుల యజమానులపై ఆగ్రహిం చాడు. దీంతో వారు గత నెల 19వ తేదీన రైతుపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తి గ్రా మంలో జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన ఎలిమినేటి పద్మారెడ్డి(60) వ్యవసాయం పొలంలో అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన గేదెలు గత నెల 19వ తేదీన గడ్డి మేస్తుండడంతో, వరి పొలాన్ని నష్టం చేస్తున్నాయని పద్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశాడు. దీంతో మేడబోయిన సత్తయ్య, అతని భార్య వీరమణి, కుమారులు బాల మల్లేష్, గోపి కృష్ణ పొలంలోనే పద్మారెడ్డిపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. అడ్డువెళ్లిన పద్మారెడ్డి భార్య కమలమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డిలను కూడా గాయపర్చారు. వెంటనే వారందరినీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సత్తయ్య, బాల మల్లేష్, గోపి కృష్ణలను మార్చి 26న అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. పద్మారెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పద్మారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిపై హత్యా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

### వడపర్తి గ్రామంలో ఉద్రిక్తత

పద్మారెడ్డిపై దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు సత్తయ్య కుటుంబీకులు కొత్తగా నిర్మిస్తున్న ఇంటిలోపల మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ బాధితులను సముదాయించారు. దాడి చేసిన నలుగురు కుటుంబ సభ్యులపై హత్యా నేరం కేసు నమోదు చేశామని, ఈ నెల 26న మేడబోయిన సత్తయ్య, అతని కుమారులు బాలమల్లేష్, గోపి కృష్ణలను కోర్టులో రిమాండ్ చేశామని, సత్తయ్య భార్య వీరమణిపై కూడా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తానని చెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం గ్రామంలో పద్మారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

# రూ.90 లక్షల విలువైన బంగారం, వెండి పట్టివేత

● ఉమ్మడి జిల్లాలో రూ. 3.59లక్షల నగదు పట్టివేత

**సూర్యాపేటరూరల్, పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, కోదాడ రూరల్, ఏప్రిల్ 1:** పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో సోమారం వాహనాల తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో 1,135 గ్రాముల బంగారం, 17కిలోల 99 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు. వీటి విలువ రూ. 90,31,038 ఉంటుందని పోలీసులు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రూ.2.39 లక్షల నగదు పట్టుకున్నట్లు చింతపల్లి ఎస్ఐ బి. యాదయ్య తెలిపారు. గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన చిత్రియాల సైదారావు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన ఎల్లబోయిన నాగరాజు నగదు తీసుకెళ్తుండగా అందుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి నల్లగొండలోని డీటీవో సేఫ్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం చెక్‌పోస్టు వద్ద విజయవాడ నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కారులో రూ. 65 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కారులో నగదు తీసుకెళ్తుండగా నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో ఆ నగదును ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలం శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి కోదాడకు కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ. 55 వేల నగదును గుర్తించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.



టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద బంగారం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

### అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం : కలెక్టర్

**సూర్యాపేట(కలెక్టరేట్):** సూర్యాపేట జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, నగలు, సామాగ్రి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో ఆధారాలు చూపితే తిరిగి ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.17కోట్ల నగదు, 7,403 లీటర్ల మద్యం (విలువ రూ. 29.35లక్షలు)తోపాటు 10వాహనాలు (విలువ రూ. 2.32లక్షలు), బంగారం ఇతర ఆభరణాల విలువ రూ.23.32 లక్షలు, ఇతర వస్తువుల విలువ రూ.70.28లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం రూ.2.43కోట్లు లక్షలు విలువ ఉంటాయని వివరించారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**భువనగిరి రూరల్, ఏప్రిల్ 1:** భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏరియా ఆస్పత్రి ఆవరణలో సుమారు 45 సంవత్సరాల వయస్సున గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఎండీ. సమీరొద్దీన్ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు గీతల టీ షర్ట్, బూడిద కలర్ పాయింట్ ఉంది. ఐదు రోజుల నుంచి ఆస్పత్రి సమీపంలో తిరుగుతున్నాడని, అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లాకేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8712662471లో సంప్రదించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ కోరారు.

## ఇంట్లో చోరీ.. బంగారు ఆభరణాలు అపహరణ

**ఆలేరు రూరల్, ఏప్రిల్ 1:** యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని బహదూర్‌పేటలోని ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధమల్ల లత శనివారం సాయంత్రం జనగామ జిల్లా సింగరాజుపల్లిలోని తమ సమీప బంధువుల ఇంట్లో జరుగుతున్న వేడుకలకు వెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని చొరబడ్డారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసుకోగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందజేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారంతో పాటు 25తులాల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ విషయమై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

## మద్యానికి బానిసై..

**వలిగొండ, ఏప్రిల్ 1:** మద్యానికి బానిసైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వీరవెల్లి మదిరగ్రామం కమ్మగూడేనికి చెందిన సీహెచ్ లాజర్(50) వృత్తిరీత్యా వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై కుటుబ సభ్యులతో గొడవ పడి వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామ పరిధి 21/13-14 మైలు రాయి వద్ద గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న రైలుకు సోమవారం ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ సుధాకర్ నల్లగొండ రైల్వేస్టేషన్‌కు సమాచారం చేరవేశాడు. భువనగిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని భువనగిరి మార్చురీకి తరలిస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. లాజర్‌కు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

## జవహర్ నవోదయ పరీక్ష ఫలితాలు విడుదల

**పెద్దవూర, ఏప్రిల్ 1:** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6, 9వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో తాత్కాలికంగా ఎంపికైన 79మంది విద్యార్థుల వివరాలతోపాటు 9వ తరగతిలో ఎంపికైన ఏడుగురు విద్యార్థుల వివరాలు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ https://navodaya.gov.in/nvs/nvsschool/NALGONDA/en/home లోఅడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం పాఠశాలకు రావాలని ఆయన సూచించారు.

## బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరల పెంపు

● కెమెరా వినియోగిస్తే రూ.25, వీడియో కెమెరా రూ.10వేలు

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 1:** అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరలు ఈ నెల 1వ తేదీ నుంచి పెంచినట్లు బుద్ధవనం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధరలు పెద్దలకు రూ.100(గతంలో 50), 12సంవత్సరాలలోపు పిల్లలకు రూ.50(గతంలో రూ.30), విదేశీ పర్యాటకులకు రూ. 300లుగా నిర్ణయించారు. ఫోటో కెమెరాను ఉపయోగించినట్లయితే రూ. 25లు, ఒక రోజు వీడియో కెమెరాను వినియోగిస్తే రూ. 10వేలు, కాన్ఫరెన్స్ హాలుకు ఒకరోజుకు రూ. 10వేలుగా ధరలు నిర్ణయించారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల లెటర్ ప్యాడ్‌లను తీసుకువస్తే టికెట్ ధరలో 50శాతం రాయితీని కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మాంక్‌లు, బౌద్ధ భిక్షువులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారుల విచారణ

**కోదాడ రూరల్, ఏప్రిల్ 1:** సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ప్రభుత్వం సరఫరా చేసే కుక్కకాటు, పాముకాటు మందులను కొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని కొందరు ఇటీవల వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఆస్పత్రిలో పనిచేసే కొందరు సిబ్బంది ఖరీదైన మందులైన కుక్కకాటుకు సంబంధించిన రేబిస్ ఇంజెక్షన్, పాముకాటుకు సంబంధించిన ఇంజెక్షన్‌ను బయటి మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు లేవని చెప్తున్నారని పలువురు రోగులు ఆరోపించారు. దీంతో ఆసుపత్రిలో వైద్యవిధాన పరిషత్ అధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ్‌ను వివరణ కోరగా, ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్నిరకాల మందులు సరఫరా చేస్తున్నామని, కుక్క, పాముకాటుకు సంబంధించిన మందులు కూడా అందిస్తున్నామన్నారు. బయటి మార్కెట్‌లో మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ విషయమై విచారణ జరిగిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు.

## 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాపై భానుడి ప్రతాపం

**నల్లగొండ, ఏప్రిల్ 1:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యప్రతాపంతో ప్రజలు విలవిలాడుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు జనం జంకుతున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో 43.0 డిగ్రీలు, చింతపల్లి మండలం గొడకండ్లలో 37.6 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో 42.2 డిగ్రీలు, తుంగతుర్తి మండ లంలో 36.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం మల్యాలలో గరిష్ఠంగా 42.2 డిగ్రీలు, వలి గొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో 37.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● దళారులను నమ్మి మోసపోవద్దు ● డీసీవో ప్రవీణ్‌కుమార్

**మోత్కూరు/అడ్డగూడూరు/ వలిగొండ, ఏప్రిల్ 1:** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.2203, సాధారణ రకం (బీ-గ్రేడ్) ధాన్యానికి రూ.2183 పొందాలని డీసీవో(డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్) బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మోత్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, మట్టి, తాలు లేకుండా కేంద్రాలకు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంటు రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్, జేఐ రంజిత్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, సంఘం సీఈవో కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ముశిపట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ డి.రాంప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో కె.స్వప్న, ఏపీఎం వెంకటేశ్వర్లు, కొల్లూరి అండాలు, ఎస్‌కె.మౌలాబీ, బి.దేవేంద్ర పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవి కాల్వ, జానకీపురం, కంచనపల్లి, ఆజీంపేట, వెల్దేవి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం డీసీవో బి.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీవో ప్రవీణ్ కుమారు మాట్లాడుతూ, రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఆసిస్టెంట్ రిజిష్టరు శ్రీనివాస్, సీఈవో వెంకటేశ్వర్లు, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు యాదయ్య, ప్రసాద్, ఏఈవో దయాకర్, వీటికే వీరలక్ష్మి ఉన్నారు.

● వలిగొండ మండలంలోని అరూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురునాథ్‌పల్లి, గంగాపురం, వెంకటాపురం, చిత్తాపురం, గోపరాజుపల్లి, అరూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



వలిగొండ: అరూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో ప్రవీణ్‌కుమార్



ఆత్మకూరు(ఎం): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో నిరంజన్

కార్యక్రమంలో కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, రంజిత్‌కుమార్‌రెడ్డి, సీఈవో కృష్ణ, ఏఈవో ప్రసన్న, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు(ఎం) :** ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని ఎంపీడీవో నిరంజన్ రైతులను కోరారు. మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్‌యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏపీఎం పక్కీరయ్య, ఏఈఓ మనిషా, ఎమ్మెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, వివోఏలు శ్యామల, శిరీష పాల్గొన్నారు.

**గుండాల:** మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జలకుమారి ప్రారంభించారు. డీఈవో నాగయ్య, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## ధాన్యం..దళారులకు భోజ్యం



మోటకొండూరులో ప్రైవేటు వ్యాపారి ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రం

**మోటకొండూర్, ఏప్రిల్ 1:** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలవుతోంది. తేమ పేరుతో తక్కువ ధర చెల్లించి రైతులను మోసం చేస్తున్నారు. మోటకొండూర్ మండలంలో దళారులు యదేచ్ఛగా వడ్లు కొనుగోలు చేస్తున్నరని తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదు. నేటికి ధాన్యం కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చేతికి వచ్చిన పంటను కోసిన తరువాత నిల్వ చేయలేక దళారులకు విక్రయిస్తున్నారు. గత సీజన్‌లో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా క్వింటాలు ఏ గ్రేడ్‌కు రూ. 2,223 బీ గ్రేడ్ రూ. 2,218 కొనుగోలు చేశారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాకపోవడంతో దళారులు రైతుల వద్ద రూ. 1880 నుంచి రూ. 1900 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.300నుంచి రూ.400 వరకు నష్టపోతున్నారు. మోటకొండూర్ మండలంలో యాసంగి సిజన్‌లో 12,962 ఎకారాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. దీని ప్రకారం వ్యవసాయ ఆధికారులు 3,629 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబాడి వస్తుందని అంచనా వేశారు. దళారులు పంట చేల వద్దకు వెళ్లి పచ్చి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

**కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి: సంగు శేఖర్, రైతు , మోటకొండూర్**



వరికోతలు ప్రాంభించి నెల కావస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించాలి.

**రైతులు తొందర పడొద్దు: వి.పద్మజ, ఆలేరు మార్కెట్ కమిటీ సెక్రెటరీ**

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసే వారిపై చర్యలు తీసుకుటాం. ఒకటి, రెండు రోజుల్లో మండలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. రైతులు తొందరపడి దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించాలి.

## ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

**తుర్కపల్లి, ఏప్రిల్ 1:** వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోయిన పంట పొలాలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండిన పంట పొలాలకు ఎకరానికి రూ.20వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాణ్యతలేని ప్రాజెక్టులు కట్టడం వల్లే నేడు రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. రేపు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా ఆమోదించాలంటే భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు యాట పెంటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్, మండల అధ్యక్షుడు భానోతు చత్రునాయక్, జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీనివాస్, నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ, ఏడుముళ్ల అంజనేయులు, ఆకుల రమేశ్, ఆకుల సైదులు, రమేశ్‌నాయక్, సాయికుమార్, మేకల పాండు, రాంచంద్రం, రాగుల శేఖర్, సురేశ్‌నాయక్, నవీన్, కిషోర్ పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడి ఆలయంలో దోపోత్సవం



దోపోత్సవంలో పాల్గొన్న భక్తులు

**మోత్కూరు, ఏప్రిల్ 1:** మోత్కూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన దోపోత్సవంతో గత నెల 24 నుంచి నిర్వహిస్తున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. దోపోత్సవం సందర్భంగా కొందరు భక్తులు దొంగలుగా వ్యవహరించి స్వామి వస్తువులు ఎత్తుకెళ్లగా, మరో కొందరు భక్తులు పోలీసులుగా వ్యవహరించి వారిని పట్టుకుని ఎత్తుకెళ్లిన వస్తువులను రికవరీ చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు మధ్యాహ్నం ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటి చైర్మన్ రామచంద్రు, కమటి సభ్యులు బొల్లెపల్లి సీతయ్య, ఉయ్యాల అంజయ్య, బయ్యని రాజు, బీను యాదగిరి, బుర్ర యాదయ్య, పట్వారి అంజయ్య, సంతోష్, మర్రి ఆనందం, తొట్ల యాదగిరి, అర్చకులు రామలింగం, నాగరాజు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి



నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

**భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 1:** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న భూదాన్‌పోచంపల్లిలోని సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల నిర్వాహకులు అభినందనీయులు అని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పగడాల జలంధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల 40వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవహర్త దివంగత గొలనుకొండ లాలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల చైర్మన్ సింగనబోయిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో గుర్రం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు నోముల గణేష్, ప్రైవేటు పాఠశాలల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు బండి యాదగిరిగౌడ్, గంజి బస్వలింగం, కుడికాల దశరథ, ట్రస్మా జిల్లా నాయకులు చంద్రశేఖర్, నోముల బస్వారెడ్డి, మండల అధ్యక్షుడు వంగూరి పాండు, భాస్కరాచారి, ఎడ్ల తిరుమల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నామని భాస్కర్, పూర్వ ఉపాధ్యాయులు వనం వెంకటేశం, పట్నం కృష్ణకుమార్, సోమవరపు లక్ష్మీనారాయణ, జి.స్వరూప పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాన్ని అడ్డుకుంటాం

● ఆ ప్రయత్నాన్ని అడ్డుకుంటాం
● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు



ఆలేరులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సీతారాములు

**ఆలేరు రూరల్, ఏప్రిల్ 1:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్యన చిచ్చుపెట్టి మూడోసారి అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని మార్చాలన్న వారి ప్రయత్నాన్ని అడ్డుకుంటామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. సోమవారం ఆలేరులో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ చరిత్రలోనే ఎర్రజెండాకు ఎంతో గొప్ప పేరుందని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. డబ్బులున్నవారు తప్ప పోటీలో దిగడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, ప్రజా సేవను చేసే వారికే ఓట్లు వేసి గెలిపించాలన్నారు. బీజేపీ అత్యంత ప్రమాదకరమైన పార్టీ అని, ఆ పార్టీని తరిమికొట్టాలన్నారు. సీపీఎం పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్, నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దూపటి వెంకటేష్, బొలగాని జయరాములు, ఇక్బాల్, పౌల్, రమేష్, రాజు, పరుశరాములు ఉన్నారు.

**ప్రజల కోసం పోరాడే వ్యక్తినే పార్లమెంటుకు పంపాలి: జహంగీర్**

**మోత్కూరు :** రానున్న పార్లమెంటు ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవని, ఈ ఎన్నికల్లో ప్రజల కోసం పోరాడే వ్యక్తినే పార్లమెంటుకు పంపాలని సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ కోరారు. సోమవారం రాత్రి మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం పార్టీ ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి, ఎన్నో ఫలితాలు సాధించిందన్నారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌లో కనీస వసతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. జిల్లాలో ఇప్పటికీ సాగునీరే ప్రధాన సమస్య అన్నారు. బీబీనగర్ ఏయిమ్స్‌లో 750 పడకలకు గాను 150 పడకలే ఉన్నాయని, 42 డిపార్ట్‌మెంట్లకు గాను 25 డిపార్ట్‌మెంట్లే పనిచేస్తున్నాయని, రోజూ 1500 నుంచి 1800 మంది ఔట్ పేషంట్లు వస్తుండగా, వారి పేరు నమోదు చేసుకోవడానికి 20 కౌంటర్లు తెరవాల్సి ఉండగా కేవలం ఆరు కౌంటర్లతో వెళ్లదీస్తున్నారన్నారు. ఇదేమిటని అడిగితే కంప్యూటర్లు లేవంటున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అరవింద్ అందులో డైరెక్టర్లని, ఎయిమ్స్ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, ఎన్నికల్లో ప్రజా ఉద్యమకారులనే ఎన్నుకుని పార్లమెంట్‌కు పంపాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కల్లూరి మల్లేషం, జిల్లా కమిటి సభ్యులు బొల్లు యాదగిరి, రాచకొండ రాములమ్మ, గుండాల, అడ్డగూడూరు మండలాల కార్యదర్శులు మద్దెపురం రాజు, బుర్రు అనిల్‌కుమార్, మెతుకు అంజయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### నియామకాలు

**భువనగిరి టౌన్:** సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య నిర్వాహణ కమిటీ నాయకులు బుగ్గ షైనయ్య, జనగాం పాండు, అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్, 9న జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను భువనగిరిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మునిసిపల్ కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, నాయకుల పడిగెల ప్రదీప్, శివలింగం, నాగారం శంకర్, దర్గాయి దేవేందర్, కర్తాల శ్రీనివాస్, బర్రె నరేష్ పాల్గొన్నారు.

**భువనగిరి అర్బన్ :** నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గడ్డం జ్ఞానేశ్వర్‌ను హైదరాబాద్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపల్లి సురేష్ కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కూరేళ్ల యాదగిరి, నాయకులు పి.జగన్, సత్యనారాయణ ఉన్నారు.

**గుండాల:** మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూపర్‌వైజర్ ఎండి.షమీన్‌బి, యాక్‌పాషా భేగం అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మర్రిపడగ గ్రామంలో ఈసీసీఈ వార్షికోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత గురించి తెలియచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

**భూదాన్‌పోచంపల్లి :** క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు, క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ సూరపల్లి రమేష్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సూపర్ మ్యాచ్‌లుగా నిలిచిన విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 2న సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్ తెలిపారు.

**భూదాన్‌పోచంపల్లి :** ప్రభుత్వ అధికారులు ప్రజలతో మమేకమై పనిచేస్తే మంచి గుర్తింపు పొందుతారని భూదాన్ పోచంపల్లి డిప్యూటీ తహసీల్దార్‌నాగేశ్వర్‌రావు అన్నారు. మండల సహాయ గణాంకాధికారి (ఏఎస్‌వో)గా పనిచేసిన యాస నర్సిరెడ్డి పదవీ విరమణ సన్మాన సభ తహసీల్దారు కార్యాలయంలో జరిగింది.

**చౌటుప్పల్:** బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కైరంకొండ అశోక్ నియమితులయ్యారు. అశోకును జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ బిజెపి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ సోమవారం నియామక పత్రం అందజేశారు.

**రామన్నపేట:** మండలంలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థి ఏనుగు ఆదిత్యరెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు ఏనుగు రామిరెడ్డి-రేవతి దంపతులు పాఠశాలకు అల్మారీ కొనుగోలు చేసేందుకు రూ.15 వేలను విరాళంగా ప్రధానోపాధ్యాయుడు బి.రాజగోపాల్‌కు అందజేశారు.

## వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా పరిగణించాలి: సీపీఎం



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 1:** మండల వ్యాప్తంగా వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా పరిగణించి, కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వెంకట్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతం కావడంతో భూదాన్‌పోచంపల్లి మండలంలోని వరి ధాన్యాన్ని బీ గ్రేడ్‌గా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ కూడా బీ గ్రేడ్ ధాన్యంగా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, కేవలం పోచంపల్లి మండలంలోని ధాన్యం మాత్రమే బీ గ్రేడ్‌గా కొనుగోలు చేస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ మండలంలోని వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా మాత్రమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కోట రామచంద్రారెడ్డి, విష్ణు, మధు, పరమేష్ పాల్గొన్నారు.

## నేడు చౌటుప్పల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1:** చౌటుప్పల్ పట్టణంలోని 132 బై 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 2న (మంగళవారం) ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## భక్తిశ్రద్ధలతో మాతం ప్రదర్శన



మాతం ప్రదర్శనలో పాల్గొన్న షియా ముస్లింలు

**భువనగిరి టౌన్, ఏప్రిల్ 1:** మహమ్మద్ ప్రవక్త అల్లుడు హజ్రత్ మౌలా అలీ వర్ధంతిని పురస్కరించుకుని షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో మాతం ప్రదర్శన నిర్వహించారు. హజ్రత్ మౌలాలిని స్మరిస్తూ పదునైన ఆయుధాలతో ఒంటిపై బాదుకుంటూ రక్తాన్ని చిందిస్తూ సంస్మరణ గీతాలు ఆలపిస్తూ భక్తిశ్రద్ధల నడుమ మాతం ప్రదర్శన కొనసాగింది. మత గురువు షియా మౌలానా షమ్స్ అబ్బాస్ నఖ్వీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ రజా హుస్సేన్, సయ్యద్ కల్బే హుస్సేన్, హైదర్ అలీ, అస్గర్, నాయక్ అలీ, అద్నాన్ రజా, బాసిత్ అలీ, అఘా మెహిది పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పేద ప్రజలనే నమ్ముకున్న కాంగ్రెస్

● కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజగోపాల్‌రెడ్డి

**చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1:** పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ అభ్యర్థి ఓ సామాజిక వర్గంపై ఆశలు పెట్టుకుంటే, కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలను నమ్ముకుందని కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో సోమవారం సాయంత్రం రాజగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీజేపీకి కనీస బలం లేదని, అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడులో బీజేపీకి డిపాజిట్ దక్కలేదని, నకిరేకల్, తుంగతుర్తిల్లో ఐదారు వేల ఓట్లు మాత్రమే వచ్చాయని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి బలం లేని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బూర నర్సయ్యగౌడ్ ఓ సామాజికవర్గాన్ని నమ్ముకుంటే, కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల మద్దతును నమ్ముకుందని ఆయన అన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలతో తాను స్వయంగా మాట్లాడితే, ఎవరూ బూరకు మద్దతు తెలపలేదని, తామంతా కాంగ్రెస్‌తోనే ఉంటామని స్పష్టం చేశారని ఆయన అన్నారు. బూర నర్సయ్య ఈ మధ్యన కోమటిరెడ్డి బ్రదర్స్‌పై నోరు పారేసుకుంటున్నారని, తెలంగాణ రాష్ట్రం కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయగా, తాను పార్లమెంట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేశానని ఆయన వివరించారు. పార్లమెంట్‌కు బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందని, ఆ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు డిపాజిట్‌లు కూడ రావని ఆయన అన్నారు. భువనగిరి పారమెఎంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలల్లో ఒక జనగాం తప్ప ఆరింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భారీ మెజార్టీతో విజయం సాదించారని, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి నాలుగు లక్షల మెజార్టీతో ఘన విజయం సాదించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీలు తాడూరు వెంకట్ రెడ్డి, గుత్తా ఉమా దేవి, జడ్పీటీసీ చిల్కూరీ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బు రాజు, పీఏసీఎస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, నాయకులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ పాల్గొన్నారు.





యాదగిరిగుట్టలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య, అడ్డగూడూరులో ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన చామల

**చామలను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం: ఎమ్మెల్యే అయిలయ్య**

**యాదగిరిగుట్ట రూరల్:** కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం గుట్ట విప్ నివాసంలో తనను కలిసిన చామలను శాలువాతో సన్మానించి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రతిమను బహూకరించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి, మండల కార్యదర్శి కానుగు బాలరాజ్‌గౌడ్, మునిసిపల్ కౌన్సిలర్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్, గుండ్లపల్లి ముత్యాలుగౌడ్ పాల్గొన్నారు.

**అడ్డగూడూరు:** మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామైన ధర్మారంలో ఎమ్మెల్యే మందుల సామేలుకు భువనగిరి పార్లమెంట్ల కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే నివాసంలో సామేల్‌ను మార్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. అనంతరం ధర్మారంలో చెక్ డ్యాంమ్ పనులను పరిశీలించి, చెక్ డ్యాంమ్ పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వళ్లంభట్ల రవికుమారు, కన్నెబోయిన గంగరాజు ఉన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 1:** గ్రామీణ క్రీడాకారుల ను ప్రోత్సహించేందుకు చౌటుప్పల్ పట్టణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. చౌటుప్పల్ పట్టణంలో 16 రోజుల పాటు నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి సాధించిన వెన్‌రెడ్డి నవీన్ రెడ్డి జట్టుకు షీల్డుతో పాటు రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతి సాధించిన ఉప్పాగుల సురేష్ జట్టుకు షీల్డుతో పాటు రూ. 50వేల నగదును ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెరుగుతుందని, విద్యతో పాటు శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు.

**సంస్థాన్ నారాయణపురం:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పల లింగస్వామి సౌజన్యంతో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి, ఏపూరి సతీష్, వాంకుడోత్ బుజ్జి నాయక్, ముద్దంగుల నరసింహ, మందుగుల బాలకృష్ణ, బీక్షపతి నాయక్, కుక్కల నరసింహ, శీను నాయక్, వంగూరి సత్తయ్య, ఉప్పల నాగరాజు, గునుగంటి రాజు పాల్గొన్నారు.